AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com
18-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## డిజిటల్ సర్వేతో పంట లెక్క పక్కా







## ఆర్టీసీ డ్రైవర్ బలవన్మరణం


## లింగంపేట ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట ఎంపీడీవోగా శుక్రవారం ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నాగిరెడ్డిపేట మండలంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. తాజాగా లింగంపేట ఎంపీడీవోగా పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. లింగంపేట అభివృద్ధికి తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తానని ఎంపీడీవో తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మలహరి, సిబ్బంది పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ రాజేష్ చంద్ర

**అక్షరటుడే, బాన్సువాడ:** నిమజ్జన ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి పాత బాన్సువాడ చావిడి నుంచి కల్కి చెరువు వరకు రూట్ మ్యాప్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. నిమజ్జన రూట్‌లో ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ఆగ్రోస్ ఇండస్ట్రీస్ మాజీ ఛైర్మన్ కాసుల బాలరాజు, గంగాధర్, కృష్ణారెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ ఖలేఖ్, గోపాల్‌రెడ్డి, వెంకన్న, శివదయాళ్, ఎజాజ్, వహాబ్, లింగమేశ్వర్ పాల్గొన్నారు.

## దానంపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు: జీవన్‌రెడ్డి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు సరైందేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపు రాజకీయాలకు హైకోర్టు బ్రేకులు వేసిందన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహించకుండా స్వీయ నియంత్రణ పాటించాలని హితవు పలికారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం గొప్ప ప్రజాస్వామిక విజయంగా ఆయన అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు ఇది గొడ్డలి పెట్టు అని ఎద్దేవా చేశారు. దానం నాగేందర్‌లాగే పార్టీ మారిన మిగితా ఎనిమిది మందిపై కూడా అనర్హత వేటు పడటం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

## జీజీహెచ్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** జీజీహెచ్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కోరారు. ఈమేరకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీ 2,500, ఐపీ 200కు పెరిగినందున ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదన్నారు. గతంలో 750 పడకలకు పెంచుతూ నిర్ణయించినా.. బడ్జెట్ కేటాయించక లేకపోవడంతో సిబ్బందిని పెంచలేదన్నారు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులు పనిభారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు.

# వైద్యారోగ్య శాఖలో కాసుల వేట..

ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రి యజమానులు, సిబ్బంది ఈ వసూళ్లను ప్రశ్నిస్తే "ఆసుపత్రులను సీజ్ చేస్తాం" అని బెదిరింపులకు దిగుతున్నారని, పైఅధికారులకు ఫిర్యాదు చేస్తే నిబంధనల పేరుతో మరింత వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పేర్లు వాడుతూ బెదిరింపులు**

ఆన్‌లైన్ బదిలీలు వద్దని ఉద్యోగులు వారించినా, "ఈ డబ్బులు నా ఒక్కడికే కాదు.. డీఎంహెచ్‌ఓ, ఏఓ అందరికీ పంపాలి, నాకేమీ భయం లేదు" అని బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం.



- వసూళ్లకు పాల్పడుతున్న ఓ అధికారి
- కమీషన్ ఇస్తేనే బిల్లుల మంజూరు
- పట్టించుకోని అధికారులు

**నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, సిబ్బంది చేతులు తడపనిదే ఏ ఒక్క ఫైలు ముందడుగు పడటం లేదని, ప్రతి పనికీ ఒక ప్రత్యేకమైన 'రేట్ కార్డ్' సెట్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.**

**- అక్షరటుడే, నెట్‌వర్క్**

ఉద్యోగుల డెప్యుటేషన్లు, వర్క్ టు ఆర్డర్లు ఇవ్వడం దగ్గర నుంచి ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు, పేర్ల మార్పు, లైసెన్స్ రెన్యూవల్స్ వరకు ప్రతిదాంట్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. చివరికి ఉద్యోగుల పెట్రోల్ అలవెన్సులు, అద్దె వాహనాల బిల్లుల మంజూరులోనూ భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయి.

**పెట్రోల్ బిల్లుల దోపిడీ!**

జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేసే క్షేత్రస్థాయి ఉద్యోగులకు నెలకు రూ.7,500 చొప్పున వచ్చే పెట్రోల్ అలవెన్సుల మంజూరులో తీవ్ర అక్రమాలు వెలుగు చూశాయి. పెట్రోల్ బిల్లులు క్లియర్ చేయాలంటే వచ్చే మొత్తంలో 20 శాతం కమీషన్ ఇవ్వాలని సదరు విభాగపు సీనియర్ అసిస్టెంట్ ముందస్తు ఒప్పందం కుదుర్చుకుని, లంచం తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

> జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని 7 అద్దె వాహనాలకు గాను ఒక్కో వాహనానికి నెలకు ₹33,000 చెల్లిస్తున్నారు. కాగా, వీటికి కమీషన్లు ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తున్నారు.

గత నాలుగేళ్లుగా రావలసిన బకాయిలను అరకొరగా ఇప్పిస్తూ అందులోనూ 20 శాతం నొక్కేస్తున్నారని, అసలు విధుల్లో లేని అనర్హుల పేరిట కూడా బిల్లులు సృష్టించి ఆ మొత్తాన్ని సీనియర్ అసిస్టెంటే సొంతం చేసుకున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. లేదంటే కాంట్రాక్టు రద్దు చేస్తామని, పాత బకాయిలు నిలిపివేస్తామని బెదిరిస్తుండటంతో వాహన యజమానులు డీఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అద్దె వాహనాలకు ప్రైవేట్ డ్రైవర్లను వినియోగించాల్సి ఉండగా, డీఎంహెచ్‌ఓ వాహనానికి ప్రభుత్వ డ్రైవర్లను వాడుకుంటున్నారు.అంతేకాకుండా, నిబంధనల ప్రకారం కట్ చేయాల్సిన టీడీఎస్ మినహాయించకుండానే నిధులు విడుదల చేస్తున్నారు.

**'ముఖ్య అనుచరుడే' చక్రం తిప్పుతున్నారా?**

సదరు సీనియర్ అసిస్టెంట్ డీఎంహెచ్‌ఓ కి 'ముఖ్య అనుచరుడి'గా చెలామణి అవుతూ, ఆయన అభయ హస్తంతోనే జిల్లా వ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు చక్రం తిప్పుతున్నారని శాఖలో టాక్ నడుస్తోంది. చివరికి తను ఇన్‌ఛార్జిగా ఉన్న పీహెచ్‌సీ లో కూడా ఇదే తరహా అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.

**సమగ్ర విచారణ చేపట్టాలి!**

వైద్యశాఖాధికారుల అవినీతిపై మీడియా కోడై కూస్తున్నా.. ఉన్నతాధికారులు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. జిల్లా వైద్యారోగ్య శాఖలో బహిరంగంగా సాగుతున్న ఈ దందాపై ఇకనైనా జిల్లా కలెక్టర్, నిఘా వర్గాలు, అవినీతి నిరోధక శాఖ తక్షణమే స్పందించాలని బాధితులు, సదరు శాఖ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిష్పాక్షిక విచారణ జరిపి, విధుల్లో లేనివారి పేరిట బిల్లులు స్వాహా చేసిన సీనియర్ అసిస్టెంట్‌తో పాటు ఆయన వెనుక ఉన్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయినా నిధులు శూన్యం: ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయినా ప్రత్యేక నిధులు విడుదల కాలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై సీఎం, విద్యాశాఖ మంత్రికి మూడు సార్లు లేఖలు ఇచ్చినా స్పష్టత లేదన్నారు. కళాభారతి, మాధవనగర్ బ్రిడ్జి పనులకు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారన్నారు. అలాగే నిజామాబాద్ బస్టాండ్ పరిస్థితి మండల కేంద్రం బస్టాండ్లా ఉందని, దీని అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు. జీజీహెచ్ ఆస్పత్రిపై గతంలో సమీక్షలు జరిగినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. ప్రధానంగా ఆస్పత్రి మార్చురీలో ఫ్రీజర్లు లేక దుర్వాసన వస్తోందన్నారు. జనరల్ వార్డుల్లోనూ సమస్యలు ఉన్నాయన్నారు. 800 మంది విద్యార్థులకు ఒక బాలికల ప్రభుత్వ పాఠశాల (పబ్లిక్ స్కూల్) ఏర్పాటు ప్రతిపాదన చేసినా ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు.

# గన్ మిస్‌ఫైర్.. ఆర్ఐ మృతి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ నగరంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్ సతీష్ గన్ మిస్ ఫైర్ అయి మృతి చెందారు. విధులు ముగించుకుని వచ్చిన అనంతరం ఆయుధాన్ని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో అక్కడికక్కడే చనిపోయారు. సీపీ సాయిచైతన్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్‌వో డ్యూటీ ముగించుకుని హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చిన ఆర్ఐ సతీష్, ఉదయం సమయంలో తన ఆయుధాన్ని క్లీన్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తుపాకీ మిస్‌ఫైర్ అయి గుండు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలిసిన వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోవడం పట్ల పోలీస్ శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు.


**నివాళులర్పించిన సీపీ**

సీపీ సాయిచైతన్య ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం ఘనంగా నివాళులు అర్పించారు. అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ కృష్ణస్వామి, సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నరేందర్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేశం సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సతీష్ మృతదేహాన్ని ఆయన స్వస్థలమైన ఖమ్మం జిల్లాలోని ఇల్లెందుకు తరలించారు.





నగరంలోని స్నేహ గణేష్ మండలిలో..





నగరంలోని ఆనంద్ నగర్‌లో



దుబ్బ పూసల సంఘం ఆధ్వర్యంలో పూసల తల్లి రూపంలో గణేష్ విగ్రహం



వెల్మల్ లో వినూత్నంగా డాక్టర్ వినాయకుడు

## ఆకట్టుకుంటున్న గణనాథులు..

వినాయక చవితి సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో రాత్రి వేళ్లలో ఆయా మండపాల వద్ద వినాయకులను చూసేందుకు భక్తులు తరలివస్తుండడంతో సందడి నెలకొంది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



సిద్ధి వినాయక గణేష్ మండలి చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా



## 'స్టార్ హెల్త్' నిజామాబాద్‌లో విస్తృతమైన సేవలందిస్తున్నాం

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** 'స్టార్ హెల్త్' నిజామాబాద్‌లో విస్తృతమైన సేవలందిస్తున్నామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్‌గఢ్ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. డాక్టర్ కన్సల్టేషన్లు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, ఔషధాలు, హెల్త్ కౌన్సెలిం టీకాలపరమైన మద్దతును సంస్థ కార్యాలయంలో ఉచితంగా అందజేస్తున్నామన్నారు. సగటున రోజుకు 15 పైచిలుకు విజిట్స్ నమోదవుతున్నాయన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి ఆంధ్రయ్య సభాధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిగా ఏఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య హాజరయ్యారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారి వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, భవిష్యత్తు నిర్మాణానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎంపీడీవో సదాశివ్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయన్న, హెచ్‌ఎంలు గంగాధర్, మధుపాల్, చంద్రశేఖర్, కిషన్, రాజేశ్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

# డిజిటల్ సర్వేతో పంటల లెక్క పక్కా..



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పంటల డిజిటల్ సర్వే నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 5,27,985 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఐదు లక్షల 5,53,473 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. ఈ పంటల వివరాలను డిజిటల్ సర్వే ద్వారా నమోదు చేసేందుకు ప్రతి గ్రామానికి ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది. - అక్షరటుడే, ఎల్లారెడ్డి**

■ ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయగానే రైతుల ఫోన్‌లకు మెసేజ్ ■ తప్పులుంటే ఏఈవోలను సంప్రదించాలని సూచన ■ 72 గంటల్లోగా సవరణకు అవకాశం..

సర్వే నంబర్ల వారీగా అధికారులు వలంటీర్ల సాయంతో పంటల వివరాలను డిజిటల్ సర్వే చేపడుతున్నారు. రైతులు తమ పొలాలకు వచ్చే సర్వే సిబ్బందికి అవసరమైన సమాచారాన్ని అందించి సర్వేను విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 30 శాతం డిజిటల్ సర్వే పూర్తయినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

### పంట అమ్మకాల్లో డీసీఎస్ కీలకం..

గ్రామాల వారీగా రైతులు ఏ రకమైన పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారన్న వివరాల ఆధారంగా ప్రభుత్వం పంటల ప్రణాళికలను రూపొందించుకోవడానికి డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించింది. విత్తనాలు, ఎరువులు ఎంత మేరకు అవసరం అవుతాయి, పంట దిగుబడి ఎంత వస్తుంది, ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే కచ్చితమైన నిర్ణయాలకు రావడానికి ఇది ఉపయోగపడుతుంది. తద్వారా పత్తి, వరి, మొక్కజొన్న పాటు ఇతర ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఇందులో వివరాలు నమోదు కాకపోతే పంటల కొనుగోలు సమయంలో ఇబ్బందులు తప్పవు.

**కామారెడ్డి జిల్లాలో సాగు వివరాలు..**

| పంటలు | విస్తీర్ణం.. |
|---|---|
| వరి | 3,19,361 |
| సోయా | 87,736 |
| మక్క | 47,237 |
| కందులు | 48,623 |
| పత్తి | 45,864 |
| పెసర | 2,198 |
| మినుము | 1,853 |
| జొన్న | 8 |
| ఇతర పంటలు | 593 |
| మొత్తం | 5,53,473 |

### ఏడు రకాల సన్నాలకు మాత్రమే..

ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ప్రకటించిన నేపథ్యంలో పంటల కొనుగోళ్లలో డిజిటల్ క్రాప్ సర్వే కీలకంగా మారనుంది. గత యాసంగిలో వరిపంట సాగు చేసినప్పటికీ క్రాప్ బుకింగ్‌లో ఆ వివరాలను నమోదు చేయలేదు. దీంతో తాము పండించిన వడ్లు అమ్ముకోవడానికి నానా పాట్లు పడ్డారు. ఇప్పుడు ఈ కొత్త విధానంతో ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి.

### ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయగానే..

ఈ డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)లో లోపాలను నివారించడానికి ప్రభుత్వం ఈ విడత నుంచి కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. వలంటీర్లు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయగానే సంబంధిత రైతు ఫోన్‌కు మెసేజ్ వచ్చేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసింది. ఇప్పటివరకు కొందరు వలంటీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పంట వివరాలను తప్పుగా నమోదు చేస్తున్నారు. ఒక పంటకు బదులుగా మరో పంటను నమోదు చేయడంతో గతంలో పంట అమ్ముకునే సమయంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు తీసుకొచ్చిన ఈ కొత్త విధానంతో పంట వివరాల నమోదు పూర్తి కాగానే రైతులకు మెసేజ్ వస్తుంది.

**నిజామాబాద్ జిల్లాలో..**

| పంటలు | విస్తీర్ణం.. |
|---|---|
| వరి | 4,36,000 |
| మొక్కజొన్న | 54,255 |
| సోయాబీన్ | 35,203 |
| పత్తి | 1,060 |
| కంది | 986 |
| పెసర | 160 |
| మినుము | 191 |
| చెరుకు | 130 |

### 72 గంటల్లోగా సవరణలకు ఛాన్స్..

డిజిటల్ క్రాప్ సర్వేలో ముందుగా గ్రామాల్లో నమోదు చేసిన వివరాలు ఏఈవోల లాగిన్‌కు వస్తాయి. వారు అప్రూవల్ చేస్తే ఆన్‌లైన్‌లో ఎంట్రీ అవుతాయి. ఒకసారి ఏఈవోలు అప్రూవల్ చేసిన తర్వాత వాటిని మార్చడం వీలు కాదు. కానీ రైతులు డీసీఎస్‌లో తప్పుడు వివరాలు నమోదైనట్లు భావిస్తే వాటిని 72 గంటల్లోగా సవరించుకునే అవకాశం ఉంది. తమ మొబైల్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుంటే దానిని సవరించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఒక వేళ సవరించుకోకపోతే అవే వివరాలు ఫైనల్ అవుతాయి. ఫోన్లకు మెసేజ్‌లు రాగానే రైతులు వివరాలు సరి చూసుకోవాలి. అయితే పలువరు అధికారులు, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే పంటలను నమోదు చేస్తున్నారు.

## బజార్ కొత్తూర్‌లో రిసోర్స్ మ్యాపింగ్



**అక్షరటుడే,నందిపేట్:** బజార్ కొత్తూరు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన (వీబీజీ రామ్‌జీ) పథకంలో భాగంగా రిసోర్స్ మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సహజ వనరులు మానవ వనరులు, వ్యవసాయ భూములు, నీటి వనరులు పశు సంపద, ఉపాధి అవకాశాలపై వివరాలను సేకరించారు. ఎంపీడీవో శ్రీనివాస్ రావు, సర్పంచ్ గోపముత్యం, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో ఘనంగా మహిళా శక్తి ఉత్సవ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కలెక్టరేట్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లా మహిళా శక్తి ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు హాజరయ్యారు. సెప్టెంబర్ 27న నిర్వహించనున్న 'ఉల్లాస్' తొలి స్థాయి అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన మూల్యాంకన పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుర్తించిన 31,702 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

## కిసాన్‌నగర్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**అక్షరటుడే, బాల్కొండ:** పోషణ మాసంలో భాగంగా 'మన అంగన్‌వాడీ - మన బాధ్యత' కార్యక్రమాన్ని కిసాన్‌నగర్ గ్రామంలో కిసాన్ నగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు షెడ్యూల్ ప్రకారం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ సర్పంచ్ రామరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మునగాకు, పాలకూర, తోటకూర, కరివేపాకు, బచ్చలికూర వంటి స్థానికంగా లభించే ఆకుకూరలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వార్డు సభ్యురాలు సమత మాట్లాడుతూ కుటుంబానికి పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంలో గృహిణుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాధా మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి పోషకాహారం ఎంతో అవసరమన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, సర్పంచ్ రామరాజు గౌడ్, ఉప సర్పంచ్ స్వామినాథ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ పరిధిలో అటవీశాఖ అధికారుల తనిఖీలు

**అక్షరటుడే,నందిపేట్:** మండల కేంద్రంలో ఆర్మూర్ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో రెస్టారెంట్లు, దాబాలు, కార్పెంటర్ షాపుల్లో అటవీశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్లు, దాబాల నిర్వాహకులకు అడవి జంతువుల మాంసాన్ని వండడం నిల్వ చేయడం లేదా విక్రయించడం చట్ట విరుద్ధమని తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లో వన్యప్రాణుల మాంసాన్ని విక్రయించవద్దని హెచ్చరించారు. నిబంధన ఉల్లంగించినట్లయితే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా కార్పెంటర్ షాపుల్లో అక్రమ కలప లేదా ఇతర అటవీ ఉత్పత్తులు ఉన్నాయనే విషయంపై తనిఖీలు చేశారు. ఈసందర్భంగా గుర్తించిన కలపకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అక్రమంగా




ఉన్నట్టు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సుధాకర్, రణవీర్, శ్రీదేవి, సెక్షన్ ఆఫీసర్ వసంత్, బీట్ ఆఫీసర్ లింబాద్రి పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధిపై సమీక్ష



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని మీసాన్‌పల్లి రైతు వేదికలో శుక్రవారం ఆరు మండలాల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, నిజాంసాగర్ మండలాలకు చెందిన సిబ్బంది, సీసీలు, స్త్రీనిధి సిబ్బంది వీవోలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, టాస్, ఫార్మ్, నాన్‌ఫార్మ్, స్త్రిచింగ్, వీవో ట్రాన్సాక్షన్, ఎంటర్ ప్రైజెస్, బిజినెస్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షలో ఏపీడీ విజయలక్ష్మి, ఐబీ డీపీఎం శ్రీనివాస్, బీఎల్‌డీపీఎం రాజయ్య, నాన్ ఫామ్ డీపీఎం సాయిలు, డీపీఎం ఎల్‌హెచ్ సురేష్, ఎస్ఎన్ ఆర్‌ఎం కిరణ్, ఎస్ఎన్ మేనేజర్లు, ఆరు మండలాల ఏపీఎంలు రామ్ నారాయణ్ గౌడ్, ప్రసన్న రాణి, వినోద్, గంగారాం, దత్తు, సాయిలు, సీసీలు, బిట్స్ పిలానీ వినోద్, అకౌంటెంట్ మహేష్ పాల్గొన్నారు.

## తల్వేదలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ




**అక్షరటుడే,నందిపేట్:** మండలంలోని తల్వేద గ్రామంలో ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. సర్పంచ్ గడసంద హరిత శ్రీకాంత్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ రూ.80,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ చెక్కు మంజూరు కావడానికి కృషి చేసిన వినయ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## భీమ్‌గల్‌లో గణేష్ మండపాల వద్ద మానాల పూజలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పలు వినాయక మండపాలను డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో చిల్డ్రన్స్ గణేష్ మండపాన్ని సందర్శించిని ఆయన పూజల అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. గోన్‌గొప్పుల గ్రామంలో సేవలాల్ యువజన సంఘం గణేష్ మండపాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంతరావు, మున్సిపల్ ఛైర్మన్ బొదిరే స్వామి, వైస్ ఛైర్మన్ జేజే నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్ర, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి, పడగల సర్పంచ్ రాజు, రాజేష్, గోపాల్, సురేష్, నరేందర్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కామారెడ్డిలో విషాదం.. ఆర్టీసీ డ్రైవర్ బలవన్మరణం



**అక్షరటుడే, కామారెడ్డి :** ఉద్యోగం కోల్పోయిన మనస్తాపంతో ఓ ఆర్టీసీ డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన కామారెడ్డి పట్టణంలోని కల్కినగర్ లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కామారెడ్డి డిపోలో రెగ్యులర్ డ్రైవర్ గా పనిచేస్తున్న పర్షం సాయన్న (48) నాలుగు నెలల క్రితం డిపోలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పరీక్షలో 33 శాతం నమోదు కావడంతో అధికారులు ఆయనను సస్పెండ్ చేసి, అనంతరం సర్వీసు నుంచి తొలగించారు. అప్పటినుంచి తిరిగి ఉద్యోగం పొందేందుకు పలు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. న్యాయపరమైన చిక్కులతో తిరిగి ఉద్యోగం రావడానికి 45 ఏళ్లు పడుతుందని తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఇంట్లో బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడికి ఇటీవలే ఎయిర్ ఫోర్స్ లో ఉద్యోగం వచ్చింది. సాయన్న మృతి పట్ల ఆర్టీసీ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఉద్యమకారుల ఊసెత్తని కేకే కమిటీ



**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన మలిదశ ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సహాయక కమిటీ జిల్లా అధ్యక్షుడు చందు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, మరికొందరు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తలుచుకుంటే ఏ పని అయినా త్వరగా పూర్తి చేయగలదని, అయితే ఉద్యమకారుల సమస్యల విషయంలో మాత్రం ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను వెంటనే ప్రారంభించాలని కోరారు.

## అమీనాపూర్‌లో భూ భారతి రీసర్వేపై గ్రామసభ



**అక్షరటుడే, ఆర్మూర్ :** వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో భూ భారతి రీసర్వే కార్యక్రమంపై నిర్వహించిన గ్రామసభకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా హాజరయ్యారు. భూములకు సంబంధించి ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ తయారీ, రైతులకు భూధార్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీసర్వేపై అవగాహన కల్పించారు. గ్రామ సరిహద్దులు, భూముల అనుభవం, హక్కులపై రైతులు తెలిపిన వివరాలను పరిశీలించి, సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ సూచించారు.